# ఏన్ డే మాతరం

పెద్ద పెద్ద కళ్ళు. రెండు కళ్ళకి పైన విశాలమైన నుదురు. నుదుటి మీద, గోరింటాకు పెట్టిన వేలితో సుతిమెత్తంగా అద్దుకుంటున్న ఎర్రటి బొట్టు . నెమ్మదిగా కెమేరా వెనక్కి వెడుతుంది. మనకి అద్దంలో తన అందమైన నుదుటి మీద కుంకుమ బొట్టు పెట్టుకుంటున్న విశాల నేత్రి కనపడుతుంది. ఇది బాపూగారి సినిమాల్లో నాకు బాగా ఇష్టమైన సీను.

గుంటూరులో మా పదిహేనేళ్ళ నీలిమ ఎప్పుడూ అద్దం ముందే నిలుచుని తన అందాల్ని తనే చూస్తుంటుంది. అంత బాగుంటుంది మరి.

అద్దం గురించి పైన చెప్పినవన్నీ సాధారణంగా మనమందరం చూశేవే అయినా మనకి అద్దం నేర్పే పాఠాలు ఎన్నో వున్నాయి. అద్దంలో మనం ఏం చూడాల నుకుంటే అది చూడచ్చు. కాకపోతే మనం అద్దం ముందు అది పెట్టటమో, అద్దాన్నే వస్తువు ముందు పెట్టటమో చేయాలి. అద్దంలో కనపడేవి, అద్దంలో బొమ్మల్లా, బాగానే వుంటాయి. మరి అద్దానికి వెనక 'ఏముంటాయి? ఏముంటుంది? - ఏమీ వుండదు. అద్దాన్ని గోడకి తగిలిస్తే దాని వెనక గోడ, స్థంభానికి తగిలిస్తే దాని వెనక స్థంభం వుంటాయి అంతే' అంటాడు మా సుబ్బారాయుడు అమాయకంగా.

కాదు చాల వుంటుంది. నిజజీవితం వుంటుందక్కడ. రోజూ జరిగే సంఘటనలూ మన కష్టాలూ సుఖాలూ వుంటాయక్కడ. మనం అద్దంలో ఏమిటి చూడొద్దనుకుంటామో అవన్నీ వుంటాయక్కడ.

0 0 0

పోయినసారి గుంటూరు వెళ్ళినప్పుడు మా ఇంటికి వచ్చారు రామ్మూర్తి వాళ్ళావిడ సీతమ్మ. వాళ్ళ అబ్బాయి చికాగోలోనూ, అమ్మాయి డల్లాస్‌లోనూ వుంటున్నారుట. వాళ్ళక్కడ సుఖంగా వున్నారు అన్నదావిడ.

'బాగుందండీ! మీకున్న ఇద్దరు పిల్లలూ సెటిల్ అయిపోయారన్నమాట' అన్నాను.

ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు 'అవును బాగానే సెటిల్ అయారు... కాకపోతే నేనూ నా భార్యా ఈ పెద్దవయసులో ఇక్కడ ఒంటరిగా మిగిలిపోయాం'

'అదేం? మీరూ హాయిగా అక్కడికే వెళ్ళి కొన్నాళ్ళు వుండొచ్చు కదా?'

అదోలా నవ్వాడాయన. 'వెళ్ళాం బాబూ! ఐదు నెలలు వున్నాం కూడాను. అక్కడి జీవితమే వేరు. అబ్బాయీ కోడలూ, అమ్మాయీ అల్లుడూ అందరూ ఉద్యోగాల్లో వున్నవాళ్ళే. పొద్దున్న ఏడుంబావుకి బయలుదేరి వెడితే మళ్ళీ సాయంత్రం ఆరు గంటల తర్వాతే రావటం. మాకేమో తోచి చావదు. బయటికి వెడదామంటే కారూ, అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కుదరదు. రోడ్డు మీద మనుష్యులు కనపడరు. నాలాటి వాళ్ళు అక్కడ వుండలేరు' అన్నాడు రామ్మూర్తి.

సీతమ్మ నవ్వి 'ఈయన తరహాయేవేరు నాయనా! అమెరికాలోకూడా అన్నీ

గుంటూరులోలా వుండాలంటారు. అదెలా కుదురుతుంది. ఇక్కడ యాభై ఏళ్ళనించీ వున్నాం కనుక వూళ్ళో అందరూ తెలిసినవాళ్ళే. రోడ్డు మీదకి వెడితే అందరూ పలకరించే వాళ్ళే. తెలుగు పేపర్లూ, తెలుగు టీవీ, తెలుగు పుస్తకాలూ, రిటైరయినా కాలక్షేపానికేమీ ఢోకా లేదు. అక్కడా అవన్నీ కావాలంటే ఎలా వస్తాయి? మావాడు జెమినీ టీవీ పెట్టించాడు. ఇంటర్నెట్లో ఆంధ్రభూమీ ఆంధ్రజ్యోతీ దినపత్రికలు చదవటం చూపించాడు. శనివారం వాళ్ళ స్నేహితులతో పార్టీల పేరుతో కలుస్తూనే వున్నాం. అయినా ఈయనకి కాలక్షేపం కావటంలేదంటారు.' అన్నదావిడ.

'మరి మీకో?' అడిగాను నవ్వుతూ.

ఆవిడా నవ్వింది. 'నాకదేమీలేదు. ఇక్కడవున్న సందడి అక్కడ వుండదు. పొద్దుటినించీ పనిమనిషీ పాలమనిషీ కూరలవాళ్ళూ పోస్టుమానూ... ఇలా ఎవరో ఒకళ్ళు పలకరిస్తుంటారిక్కడ. ఇద్దరం ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళమే అయినా, వాళ్ళ ఏక్సెంట్ అంత తొందరగా మనకి అర్థమవదు. అక్కడి పద్ధతులు అక్కడివి. మనం వాళ్ళ దేశం వెళ్ళి వాళ్ళ సంస్కృతిని మనలాగా లేదు అని అలిగితే ఎలా?' అందావిడ.

'నేను కంప్లైంట్ చేయటంలేదు. నా బాధ చెప్పుకుంటున్నాను. అంతే' అన్నాడాయన సమర్థించుకుంటూ.

'మరి ఏం చేద్దామనుకుంటున్నారు' అని అడిగాను.

'ఏముంది. ఉన్న ఇద్దరు పిల్లలనీ పరదేశానికి అర్పించి, ఈ వయసులో ఒంటరిగా ఇక్కడే కాలం వెళ్ళబుచ్చుదామనుకుంటున్నాం. మనవలూ మనవరాళ్ళూ పుడితే, ఓపికుంటే ఇంకోసారివెళ్ళి ఐదారు నెలలు వుండి వస్తాం. లేదా వాళ్ళతో ఇక ఫోన్‌లోనే మాటామంతీ. మాకిక్కడ రోగమొచ్చినా రొష్టు వచ్చినా మేమిద్దరమే ఒకళ్ళ కొకళ్ళం ఎవరూ లేనివాళ్ళలా' ఆయన ముఖంలో బాధ స్పష్టంగా తెలుస్తూ వుంది.

'వాళ్ళు తిరిగి ఇండియాకి వచ్చేస్తారన్న ఆశ లేదు. కాకపోతే ఎక్కడయితేనేం సుఖంగా వుంటే అంతే చాలు' అన్నదావిడ.

వాళ్ళు వెళ్ళిపోయినా వాళ్ళ మాటలు నన్ను వెంటాడుతూనే వున్నాయి. ఈ విషయం కొత్తదేమీ కాదు. అమెరికాలోనూ, ఇండియాలోనూ చూస్తున్నదే. అప్పుడే అంతకుముందు వారంరోజుల క్రితం, నన్ను కలిసిన సుబ్రమణ్యం శ్యామల గుర్తు కొచ్చారు. వాళ్ళకి ఒక్కగానొక్క కూతురు. ఆయనకి అమ్మాయి వాళ్ళ కళ్ళ ముందరే ఇండియాలో వుండాలని కోరిక. ఆవిడకి మాత్రం అమెరికా సంబంధం తెచ్చి, అమ్మాయిని అమెరికా పంపించాలని.

నేను చెప్పవలసిన మంచీ చెడు రెండూ చెప్పి నిర్ణయం వాళ్ళకే వదిలేశాను. కొన్నాళ్ళు అమెరికాలో వుండి వెనక్కి తిరిగి వచ్చేద్దామనుకుని వెళ్ళేవాళ్ళే అందరూ. కాకపోతే గణాంకాల ప్రకారం వాళ్ళల్లో వేయిమందికి ఒక్కరు మాత్రమే వెనక్కి తిరిగి వెడుతున్నారు. వీసాల వల్ల వచ్చే సమస్యలతో వెనక్కి వెళ్ళే వాళ్ళే ఎక్కువమంది కనపడతారు. తమంతట తామే వెళ్ళే వాళ్ళు లేరని కాదు. తక్కువ అని.

శ్యామల అన్నది, 'మాఅమ్మాయి అలాటిది కాదు. అక్కడ కొన్నాళ్ళు వుండి ఆర్థికంగా బలపడి వెనక్కి వచ్చేస్తుంది. ఈలోగా మేమూ ఒకటి రెండు సార్లు వెళ్ళి

అమెరికా చూసి వచ్చేస్తాం.'

ఇలాటివాళ్ళు నాకు చాలమంది తారసపడ్డారు. అమెరికా మీద గ్లామరో ఇరుగు పొరుగుతో గొప్పగా వుంటుందనే అతిశయమో, నిజంగా ఆర్థిక పరిస్థితి బాగుపడుతుందనే ఆశవల్లనో, హడావిడి పడుతుంటారు కానీ దూరదృష్టి కనపడదు. కావాలని వెళ్ళిపోతే ఫరవాలేదు. అటు వెళ్ళి, తిరిగి రాలేక త్రిశంకుస్వర్గంలో మధన పడకుండా వుంటే చాలు.

కాలిఫోర్నియాలో సురేష్, వాళ్ళావిడ ఇద్దరూ డాక్టర్లే. సురేష్ మామగారిని ఇండియాలో వదిలేసి అత్తగారిని మాత్రం అమెరికా తీసుకువచ్చాడు. వాళ్ళ ఇద్దరు పిల్లలకీ బేబీ సిట్టింగ్‌కి వారానికి ఐదు వందల డాలర్లవుతుందనీ, అలా అయితే చౌక అనీ. మామగారిని కూడా తీసుకువస్తే చౌక అవదని అతని లెఖ్ఖలు చెబుతున్నాయి మరి. అందుకని వయసులో వున్న వృద్ధ దంపతులని విడదీయటానికి కూడా వెనుకాడలేదు అల్లుడుగారు. అంతే కాదు, పిల్లలు పెద్దయాక అత్తగారిని ఇండియాకి పంపించేసి, ఇద్దర్నీ ఏ ఓల్డ్ ఏజ్ హోంలోనో పెట్టాలని కూడా అనుకుంటున్నారు.

ఇంకా వీళ్ళు నయమని మా రామారావు ఉద్దేశ్యం. ఆయనకి తెలిసిన ఒక గుజరాతీ స్నేహితుడు ఇంకా గొప్ప పని చేశాడు. ఒక హైటెక్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ, ఒక పెట్రోలు బంకు కొనుక్కున్నాడు. అక్కడ తండ్రిని వుంచి తల్లిని ఇంట్లో ముగ్గురు పిల్లలకీ బేబీ సిట్టర్‌గా వుంచుకున్నాడు. ఆయన భార్య వేరే మంచి ఉద్యోగంలోవుండి, ఎప్పుడూ బిజీగా వుంటుందిట మరి. ఈ కథ ఇక్కడితో అయి పోయినా బాగానే వుండేది. కానీ ఇంకో మలుపు తిరిగింది. తండ్రికి ఆరోగ్యం చెడి పోయి మంచమెక్కాడు. అటు మందుల ఖర్చే కాక, తన పెట్రోలు బంకు చూసుకునే వాళ్ళుకూడా అంతకన్నా చౌకలో దొరకలేదు. అందుకని ఆయన్ని గవర్నమెంట్ వారి ఉచిత ముసలివారి గృహంలో వదిలేశాడు. తల్లి ఇంకా పిల్లల్ని చూసుకోవాలి కనుక అక్కడే వుంది. పిల్లలు పెద్దవగానే, తల్లినీ అక్కడికే పంపిస్తాడని అందరికీ తెలుసు.

అందరూ ఇలాటివారేననీ, ప్రేమలు చచ్చిపోయాయనీ చెప్పటం కానీ, జనరలైజ్‌చేసి అమెరికాలో చాలామందింతేఅని చెప్పటంకానీ నా ఉద్దేశ్యం కాదు, అది నిజమూ కాదు. కాకపోతే జరుగుతున్న, జరిగిన కొన్ని విషయాలను చెప్పి హెచ్చరిద్దా మని వ్రాస్తున్నాను. తమ పిల్లల్ని అమెరికాకి అర్పించేయాలని ఆత్రుత పడే మాతలకి ఒక వందనం అర్పిస్తూ, పైన చెప్పిన కథలు వాళ్ళ జీవితాల్లో ఏ ఒక్క రోజూ రాకూడదని ఇది వ్రాస్తున్నాను.

0 0 0

అద్దం ఎప్పుడూ నిజమే చెబుతుంది అనేది మా అత్తయ్య.

'అదేం కాదు! కుడిని ఎడమగానూ, ఎడమని కుడిగానూ చూపిస్తుంది' అనేవాడు మామయ్య.

ఇద్దరు చెప్పేదీ నిజమేనేమో!!!

0 0 0